క్లుప్తంగా

ఎస్సైగా ఫణి మోహన్



మధురపూడి: సీతానగరం ఎస్సైగా ఎ.ఫణికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సఖినేటిపల్లి ఎస్సైగా పని చేసి, స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి సీతానగరానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీసు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

ఎస్ఎంసీ ఎన్నిక

మధురపూడి: కోరుకొండ అత్తిలి సత్యనారాయణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. చైర్మన్‌గా తెలగంశెట్టి శివరామకృష్ణ, వైస్ చైర్మన్‌గా మాతా రాజేశ్వరి, వీరితో పాటు 13 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో కోరంలేక నిలిచిపోయిన ఎన్నికను శనివారం మరోసారి నిర్వహించారు. పరిశీలకుడిగా ఎంఈఓ టి.కుశలవదొర, కన్వీనర్‌గా స్కూల్ హెచ్ఎం ఎంఎస్ మణికుమార్ వ్యవహరించారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అభినందించారు.

జక్కంపూడి రాజా పరామర్శ

మధురపూడి: మాతృ వియోగంతో బాధపడుతున్న కోరుకొండ మండలం బూరుగుపూడి మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట సత్యనారాయణమూర్తి (వీరపండు)ను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. వీరపండు తల్లి సత్యవతి ఇటీవల మృతి చెందారు. రాజా వెంట పార్టీ బూరుగుపూడి గ్రామశాఖ అధ్యక్షుడు మేకే నెహ్రూరాజు తదితరులున్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

పెదపూడి: మండలంలోని వేండ్రలో అక్రమంగా దాచిన 20.31 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని 6ఏ కేసు నమోదు చేశామని ఎంఎస్‌వో కీర్తి శనివారం తెలిపారు. తమకు అందిన ఫిర్యాదుల మేరకు ఆర్ఐ త్రివేణి, వీఆర్వో లంకకుమార్‌లతో కలిసి వేండ్రలో ఈ నెల 11వ తేదీన తనిఖీలు చేపట్టామన్నారు. నర్ల సత్తిబాబు ఇంటి వద్ద ఒక వ్యాన్‌లో అక్రమంగా దాచిన 20.31 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నామన్నారు. ఆ బియ్యాన్ని స్థానికంగా 30వ రేషన్ షాపునకు, అక్కడి నుంచి వేళంగిలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్దకు తరలించామన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట: చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన చాగల్నాడు ఎత్తిపోతల పథకం అధికారులతో, మండల రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా సాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వం నుంచి తగినన్ని నిధులు మంజూరు చేయించి నాలుగు మోటార్లు పనిచేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చాగల్నాడు పథకం డీఈఈ ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

రంగంపేట: ప్రభుత్వం పథకం పక్కాగా ప్రజలకు చేరాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2023–24లో చేపట్టిన వేతన సంబంధిత పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద ప్రెసిడింగ్ అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎ.ముఖలింగం ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజావేదికలో రికవరీలు, జరిమానాల రూపంలో రూ.4,85,000లు విధించినట్టు అధికారులు తేల్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, ఎంపీడీఓ పి. వెంకటరత్నం, అంబుడ్స్‌మెన్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సమావేశాలు

కంబాలచెరువు: నూతన విద్యా సంవత్సరంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ప్రారంభమయ్యాయని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులోని డీఎంహెచ్ స్కూల్లో జరుగుతున్న ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని శనివారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కాంప్లెక్స్ సమావేశాలు జరగాలన్నారు. ఈ సంవత్సరం ఒకటో తరగతి విద్యార్థులకు ప్రారంభించిన విద్యా ప్రవేశ్ కృత్యాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. డీఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో మిగిలిన ఉపాధ్యాయులు సోమవారం నెహ్రూనగర్ ఉన్నత పాఠశాలలో జరిగే సమావేశాలకు హాజరై, అక్కడే ఆన్‌లైన్ హాజరు నమోదు చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి పరస జగన్నాథరావు, సీఆర్పీలు జయంతి శాస్త్రి, కోటేశ్వరి, విషయ నిపుణులు కృష్ణమోహన్, కె.రాజు, రాధ పాల్గొన్నారు.

అగ్రిల్యాబ్‌తో అనేక లాభాలు

- కోరుకొండలో వ్యవసాయ ప్రయోగశాల
- మాజీ సీఎం జగన్ హయాంలో నిర్మాణం
- అన్నదాతకు అన్ని విధాలా సాయం



కోరుకొండలో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబొరేటరీ



ప్రయోగాలు నిర్వహిస్తున్న అఫీషియల్ ఎనలిస్టు, సిబ్బంది

మధురపూడి: దేశం అభివృద్ధి చెందాలన్నా, ప్రగతి పథంలో పయనించాలన్నా రైతులతోనే సాధ్యమవుతుంది. ముఖ్యంగా వ్యవసాయం బాగుంటేనే పల్లెల నుంచి దేశం వరకూ ముందుకు సాగుతుంది. ముఖ్యంగా మన రాష్ట్రంలో అనేక మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారు. కాబట్టి ప్రభుత్వాలు అన్నదాతలకు అన్ని విధాలుగా సాయమందించాలి. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విషయానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. రైతుల సంక్షేమం కోసం అనేక పథకాల ప్రవేశపెట్టి అండగా నిలిచారు.

2021లో అగ్రి ల్యాబ్ నిర్మాణం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో 2021లో కోరుకొండ మండలం కాపవరంలో వ్యవసాయ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. దీని కోసం అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎంతో కృషి చేశారు. విత్తనాలు, ఎరువు , పురుగు మందుల్లో కల్తీలు, నకిలీలను అరికట్టేందుకు దీన్ని నిర్మించారు. తద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతులకు అందించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ప్రధాన లక్ష్యం. 2021లో రూ.1.10 కోట్లతో నిర్మించిన ఈ ప్రయోగశాలకు డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌గా నామకరణం చేశారు. దీన్నే ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చరల్ ల్యాబ్‌గా పిలుస్తున్నారు. 2022 చివరి నుంచి ఈ ల్యాబ్ వినియోగంలోకి వచ్చింది. దీనిలో ఇప్పటి వరకూ 2,464 ప్రయోగాలు నిర్వహించారు.

రైతాంగానికి మేలు

కల్తీ, నకిలీ విత్తనాలు, పురుగుమందులను అరికట్టబడటం ద్వారానే వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే ధ్యేయంగా ఇక్కడ ప్రయోగాలు జరుగుతున్నాయి. వాటి ఫలితాల ఆధారంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నాణ్యమైన విత్తనాలను వాడడం వల్ల పంట బాగా రావడంతో పాటు దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. ముఖ్యంగా రైతుల ఆర్థిక అభ్యున్నతి సాధిస్తారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అందించడమే లక్ష్యంగా ప్రయోగశాల పనిచేస్తోంది. 2022 నుంచి ఇప్పటి వరకూ 2,464 ప్రయోగాలు చేశారు.

పనితీరు

ప్రయోగశాలకు వచ్చిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు పరీక్షలు నిర్వహించి, వాటి నాణ్యతను తెలియజేయడమే ఇక్కడి ఉద్యోగుల ప్రధాన కర్తవ్యం. ఈ పరీక్షలు నిర్ణీత కాలం ప్రకారం జరుగుతోంది.

ఇక్కడ రైతుల నుంచి, ఎరువుల దుకాణాల యజమానుల నుంచి వచ్చిన వాటికి ప్రయోగాలు చేస్తారు. ప్రయోగాల్లో నాణ్యతను గుర్తించడం జరుగుతుంది. రైతులు తీసుకొచ్చిన విత్తనాలను, వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన వాటిని కూడా పరీక్షిస్తారు. విత్తనాలతో పాటు ఎరువులు కూడా ల్యాబ్‌లకు వస్తాయి. వాటిని పరీక్షిరిచి వాటి నాణ్యతను నిర్ధారిస్తారు. ఆ ఫలితాలను శాఖా పరమైన అధికారులకు తెలియజేస్తారు. రైతు భరోసా (ఆర్‌బీకే) కేంద్రాలకు ప్రభుత్వం ద్వారా వచ్చిన విత్తనాలు, ఎరువులకు పరీక్షలు జరుపుతారు. అదే విధంగా ఎరువులు, పురుగుమందుల దుకాణాల యజమానులు కొనుగోలు చేసుకున్న వాటికీ కూడా పరీక్షలు చేస్తారు. ఆయా పరీక్షలకు గాను దుకాణాల యజమానులు రుసుం చెల్లించాలి. నాణ్యత లోపించిన వాటిని నాశనం చేస్తారు. ఆయా కంపెనీలపై వ్యవసాయ చట్టం ప్రకారం చర్యలుంటాయి. ఇక్కడకు విత్తనాలు కూడా వివిధ రకాలుగా వస్తాయి. వాటిని సీడ్ (విత్తనాలు), ఎక్ట్ (వ్యవసాయ కమిషనరేట్), ఆర్‌బీకే (రైతు భరోసా కేంద్రాలు), ట్రేడ్ (ఎరువులు, విత్తనం దుకాణాల వ్యాపారులు), ఫార్మర్స్ (రైతులు) విభాగాలుగా గుర్తించారు.

విత్తనాలపై ఎక్కువ ప్రయోగాలు



ఎరువులతో పోల్చితే విత్తనాలపైనే ఎక్కువ ప్రయోగాలు జరిగాయి. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రయోగశాలను నిర్వహిస్తున్నాం. మరిన్ని ప్రయోగాలు చేసి, నకిలీ, కల్తీ లేని విత్తనాలు, ఎరువులు రైతులకు అందించడానికి కృషి చేస్తాం.

– డి.రామతులసి, అఫీషియల్ ఎనలిస్టు

రైతులకు ఎంతో మేలు



కోరుకొండ మండలం కాపవరంలోని వ్యవసాయ ప్రయోగశాలతో రైతాంగానికి ఎంతో మేలు జరుగుతోంది. విత్తనాలు, ఎరువుల పరీక్షలు జరుగుతున్నాయి. రైతాంగం తయారు చేసుకుంటున్న విత్తనాలపై కూడా ప్రయోగాలు చేసి, నాణ్యతను తెలియజేస్తున్నారు. విత్తనాల విషయమై ఎక్కువ ప్రయోగాలు జరిగాయి.

– అత్తిలి రామప్రసాద్, శ్రీరంగపట్నం పీఏసీఎస్ మాజీ చైర్మన్

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: సీతానగరం మండలంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి శనివారం పరామర్శించారు. సింగవరానికి చెందిన ఈలి గణేశ్వరరావు, చీపురుపల్లికి చెందిన బిళ్లకుర్తి వెంకటేశ్ ఇటీవల మృతి చెందారు. చీపురుపల్లికి చెందిన కోన జగదీశ్వరరావు భార్య కూడా కననఉమూశారు. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబ సభ్యులను జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. సింగవరం ఎంపీటీసీ సభ్యుడు కొమిశెట్టి వెంకటేశ్వరరావు హాస్పటల్లో చికిత్స పొంది, ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను విజయలక్ష్మి పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ గుర్రాల జోత్స్న తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక



రమ్యసుధ

రంగంపేట: జాతీయ స్థాయి వృత్యంతర శిక్షణకు రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వి.రమ్యసుధ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి సెప్టెంబరు 10వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్ బాడ్గాన్‌లో సీసీఆర్‌టీ రీజినల్ సెంటర్లో నిర్వహించే వృత్యంతర శిక్షణా తరగతులకు ఆమె హాజరవుతారన్నారు. ఆమెతో పాటు జిల్లా నుంచి హుకుంపేట, వెదులపల్లె హైస్కూల్స్ నుంచి పి. లక్ష్మీఫణికుమార్, ఎస్. శ్రీనివాసులు కూడా హాజరవుతున్నార న్నారు. రమ్యసుధకు పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



అనపర్తిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



పెదపూడి సీహెచ్‌సీ వద్ద నిరసన తెలియజేస్తున్న వైద్య సిబ్బంది

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో ఐఎంఏ అధ్వర్యంలో వైద్య సిబ్బంది నిరసన

పెదపూడి: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనలో నిందితులను బహిరంగంగా కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. అనపర్తి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అధ్యక్షుడు రామగుర్రెడ్డి అధ్వర్యంలో అనపర్తి గాంధీ విగ్రహం వద్ద వైద్య సిబ్బంది కోల్‌కత్తా ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన వ్యక్తులపై సత్వర విచారణ నిర్వహించి కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెదపూడి: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని పెదపూడి సామాజిక ఆరోగ్యకేంద్రం(సీహెచ్‌సీ) వైద్యులు హర్షవర్ధన్ అన్నారు. సీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్‌కతా వైద్య విద్యార్థినిపై దాడికి పాల్పడిన నిందితులను తక్షణమే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమణమూర్తి, వైద్యులు అనూష, శ్రావణి, సుభాష్, వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద వైదురాలు శిరీష ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నిరసన తెలిపారు.

బిక్కవోలు: కోల్‌కత్తా ఘటనను నిరసిస్తూ స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి, జె.ఏసుజ్యోతిల ఆధ్వర్యంలో కొంకుదురు, తొస్సిపూడి, పందలపాక, కొమరిపాలెం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటుచేశారు. దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ–క్రాప్‌తో బహుళ ప్రయోజనాలు



నరేంద్రపురంలో వరి పంటను పరిశీలించి, సూచనలిస్తున్న జేసీ చిన్నరాముడు, డీఏవో మాధవరావు

రాజానగరం: ఈ–క్రాప్‌తో బహుళ ప్రయోజనాలు చేకూరతాయని, రైతులందరూ తప్పనిసరిగా చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. మండలంలోని నరేంద్రపురంలో ఖరీఫ్ వరి సాగును జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావుతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ–క్రాప్ ఏ మేరకు అయ్యిందనే విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు ఈ– క్రాప్‌ను తప్పనిసరిగా చేయించుకోవడంతో పాటు కౌలు గుర్తింపు కార్డులను పొందడం ఎంతో మంచిదన్నారు. వారు సాగు చేస్తున్న పంటలపై ప్రయోజనాలను అందుకోవడంతో పాటు పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు పొందడానికి, ధాన్యం విక్రయాలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

దిగుబడి బాగా వచ్చే అవకాశం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అక్కడక్కడా పంట నష్టం వాటిల్లినా, అప్పటికే వరి నాట్లు వేసి, దుబ్బు చేసి ఉన్న పొలాలు ప్రస్తుతం ఆకుపచ్చదనంతో బాగున్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు అన్నారు. ఆయా పొలాల్లో ఎకరాకు 40 బస్తాలకు పైబడి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. భారీ వర్షాలు, వరదలతో పొలాల్లోకి ఒండ్రుమట్టి చేరడంతో వరిపంటకు మేలు చేకూరడం ద్వారా దిగుబడులు బాగుంటాయన్నారు. వారి వెంట తహసీల్దార్ కె.లక్ష్మీలావణ్య, మండల వ్యవసాయాధికారి ఇమామికాసిం, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంఓ రామారెడ్డి

పెదపూడి: ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని కాకినాడ జిల్లా విద్యాశాఖ ఏఎంఓ ఎంవీ రామారెడ్డి అన్నారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా బోధించాలని సూచించారు. విద్యార్థులందరికీ చదవడం, రాయడం, గణితంలో చతుర్వేద ప్రక్రియలు చేయగలిగేటట్లు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు వృత్తి పట్ల అంకితభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతోనే లక్ష్యాల సాధన



మాట్లాడుతున్న సినీ దర్శకుడు సందీప్ రెడ్డి

రాజానగరం: ఆత్మస్థైర్యంతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని సినీ దర్శకుడు సందీప్ రెడ్డి అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలోని సుశృత ఫంక్షన్ హాలులో శనివారం రాజమహేంద్రవరంలోని స్వతంత్ర్య ఆస్పత్రి 38వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందీప్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఫిజియోథెరపీ కోర్సు చేసి, కొంతకాలం ప్రాక్టీసు కూడా చేశానన్నారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలో ఉన్న ఆధునిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ వైద్య విద్యను పూర్తి చేసి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రోగికి నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలన్నారు. తొలుత జీఎస్ఎల్ వైద్య కళాశాలలోని అత్యాధునిక వైద్య సదుపాయాలను డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ గన్ని సందీప్, డాక్టర్ తరుణ్‌లు దర్శకుడు సందీప్‌రెడ్డికి చూపిస్తూ, వాటి ప్రత్యేకతలను వివరించారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించినట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఆంధ్రనగర్‌లోని పవర్స్ ఎయిడెడ్ ఇంగ్లిష్ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్నికైన సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. మొత్తం 21 మంది సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నికై నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.పద్మజ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ జయంతి శాస్త్రి, ఎన్నికల పరిశీలకులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి మాతృభాషపై పట్టు అవసరం



శిక్షణలో మాట్లాడుతున్న ఏఎల్ఎస్‌సీ కో ఆర్డినేటర్ కనకబాబు

కడియం: ఒక విద్యార్థి అన్ని సబ్జెక్టులలోనూ మంచి మార్కులు సాధిస్తున్నాడంటే, అతడికి తప్పకుండా మాతృభాషపై పట్టు ఉందని గ్రహించాలని ఏఎల్ఎస్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ కనకబాబు అన్నారు. రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు సెకండరీ గ్రేడ్ టీచర్ల శిక్షణ తరగతులను ప్రారంభించారు. హైస్కూలు హెచ్ఎం టి.సత్యనారాయణ, సబ్జెక్టు ఆర్పీలు గొల్లపల్లి సత్యనారాయణ, పి.వల్లీతాయారు పలు అంశాలను వివరించారు. సుదర్శన్, శ్రీదేవి తదితర ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో అమలు చేస్తున్న బోధనా విధానాలను వివరించారు. ఉపాధ్యాయులు గ్రూపులుగా ఏర్పడి ఫార్మేటివ్, సమ్మేటివ్ ప్రశ్నాపత్రాలను రూపొందించారు.

మంజూరు దశలో నిధులు

సాక్షి ఇంపాక్ట్

రాజానగరం: గ్రామంలోని పాత జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపామని, దానికోసం రూ.10 లక్షల నిధులు మంజూరు దశలో ఉన్నాయని ఆర్అండ్‌బీ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ రెడ్డి తెలిపారు. సినిమా థియేటర్ వద్ద పూర్తిగా ధ్వంసమైన రహదారి, సంపత్ నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యపై నడవడానికి నరకయాతనే అనే శీర్షికన 'సాక్షి'లో శనివారం వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. అనంతరం నిధుల విషయం తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతామన్నారు. అలాగే సంపత్ నగరంలో రోడ్డు పక్కన కాలువ నిర్మాణం జరుగుతోందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలోని నీరు, వర్షం నీరు కలిసిపోయి రోడ్డుపై ప్రవహిస్తున్నాయన్నారు. కాలువ నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించడంతో పాటు పాడైన రోడ్డుకు కూడా త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నారు.

ఎంపీడీవో రాజ్‌మనోజ్ సేవలు అభినందనీయం



ఎంపీడీవో రాజ్‌మనోజ్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్ తదితరులు

కడియం: ఎన్నికల విధుల్లో భాగంగా ఎంపీడీవోగా వచ్చిన జి.రాజ్ మనోజ్ అందించిన సేవలు అభినందనీయమని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. బదిలీల్లో భాగంగా మనోజ్ తిరిగి వెనక్కి వెళుతున్న నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద అభినందన సత్కారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవోతో పాటుo గ్రేడ్– 2 కార్యదర్శులుగా పదోన్నతులు పొందిన వీరవరం, కడియపుసావరం, మురమండ కార్యదర్శులు వెంకటలక్ష్మి, విజయరాజు, సరోజిని, కార్యదర్శులుగా పదోన్నతి పొందిన కడియం, జేగురుపాడు, దుళ్ల జూనియర్ అసిస్టెంట్లు శ్రీరామచంద్రమూర్తి, సాయిరాం, విజయలక్ష్మిను కూడా ఈ సందర్భంగా సత్కరించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, వైస్ ఎంపీపీ పంతం గణపతి, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, జనసేన అధ్యక్షుడు ముద్రగడ జెమి తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్యామాంగ శ్రీనివాస్ దాస్ తదితరులు

సీటీఆర్ఐ: ఇస్కాన్ (రాధా గోపీనాథ్ దశావతార మందిర్)లో ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు శ్యామాంగ శ్రీనివాస్ దాస్ అన్నారు. ఈ మేరకు శనివారం ఇస్కాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు జరగుతాయన్నారు. 19న బలరామ జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలు, పల్లకీ సేవ, 20 నుంచి 26 వరకూ వివిధ రకాల వాహన సేవలు నిర్వహిస్తామన్నారు. 26వ తేదీ సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వివిధ పూజలు, 12 గంటలకు పోటీలు, 3 గంటలకు ఉట్టి ఉత్సవం, రాత్రి 10.30 గంటలకు రాధాగోపీనాథులకు మహా కుంభాభిషేకం జరుగుతాయన్నారు. ఇస్కాన్ సంస్థాపకాచార్యులు శ్రీల ప్రభుపాదుల వారి ఆవిర్భావ మహోత్సవం సందర్భంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు మహా అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. హేమ నిమాయదాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలను విస్తృతం చేయాలి



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న భాస్కరరామ్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ద్వారా సామాజిక సేవలను విస్తృతం చేయాలని నూతన కార్యవర్గానికి ప్రముఖ ఆడిటర్, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ వి.భాస్కరరామ్ సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ 2024 –25 అధ్యక్షులుగా బి.లీలా సుభాష్‌రెడ్డి, కార్యదర్శిగా పి.వికాస్, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణం స్వీకారం చేశారు. స్థానిక ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. అధ్యక్షులు బి.లీలా సుభాష్ రెడ్డి మాట్లాడుతూ రోటీ, కపాడా, ఎడ్యుకేషన్ అన్న సంకల్పంతో తమ క్లబ్ ద్వారా ప్రణాళికబద్ధంగా సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో తమ్మిబత్తుల రవి, లెఫ్టినెంట్ జాస్తి మూర్తి, నాళం నరసింహారావు, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 అసిస్టెంట్ గవర్నర్ పీవీఎస్ఎన్ దొరబాబు, రోటేరియన్లు కంకిరెడ్డి గోపాలకృష్ణ, సుంకర నాగేంద్ర కిషోర్ పాల్గొన్నారు.